క్లుప్తంగా

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులతో ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు: బి. కోడూరు మండలం మాధవ రాయునిపల్లిలో ఆదివారం జరిగిన వివాహ వేడుకలో వధూవరులను బద్వేలు ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆశీర్వదించారు. బద్వేలు ఎంఆర్ ఎఫ్ టైర్స్ షోరూం అధినేత రమణారెడ్డి బావ మరిది వివాహం ఆదివారం బి. కోడూరు మండలం మాధవరాయునిపల్లిలో ఘనంగా జరిగింది. ఈ వివాహానికి ఎమ్మెల్యే డాక్టర్ సుధ పాల్గొని వధూ వరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో బద్వేలు మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు సుధర్‌రామిరెడ్డి, బూత్ కన్వీనర్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఈగా ఎద్దారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ సాయికృష్ణా, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు రామకృష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి పోలిరెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేయించుకుంటున్న బంగారుమునిరెడ్డి

ప్రొద్దుటూరు క్రైం : స్థానిక మున్సిపల్ గాంధీ పార్కు వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని మున్సిపల్ వైస్ చైర్మన్ పాతకోట బంగారుమునిరెడ్డి ప్రారంభించారు. డాక్టర్ పాలగిరి కిరణ్ కుమార్‌రెడ్డి సురక్ష మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో బంగారు మునిరెడ్డి వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శేఖర్ యాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు మార్తల గురివిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సైనికుడికి నివాళి



వెంకటకొండయ్యకు నివాళులర్పిస్తున్న మాజీ సైనికులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వసంతపేటకు చెందిన మాజీ సైనికుడు ఎం.వెంకట కొండయ్య (83) శనివారం అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ సైనికులు ఆదివారం వెంకటకొండయ్య భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఫెన్స్ ఎక్స్‌సర్వీస్‌మెన్ అసోసియేషన్ అధ్యక్షుడు బాలవీరారెడ్డి మాట్లాడుతూ వెంకటకొండయ్య వాయుసేనలో 38 ఏళ్లు సేవలందించి ఎండబ్ల్యూఓగా 2000లో పదవీ విరమణ చేశారన్నారు. ఆయన కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ సైనికులు సిద్దన్న, చంద్రశేఖర్‌రెడ్డి, మోహన్, దస్తగిరి, హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.

నివాళి



నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

ఖాజీపేట : వైఎస్సార్‌సీపీ పత్తూరు ఎంపీటీసీ దొరవారి రాముడు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి పత్తూరు గ్రామానికి చేరుకుని ఆయన మృతదేహానికి నివాళి అర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరనిలోటన్నారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఏపీఎస్ ఆర్టీసీ కడప మాజీ జోనల్ అధ్యక్షుడు రెడ్యం వెంకటసుబ్బారెడ్డి, మండల కన్వీనర్ మురళీమోహన్‌రెడ్డి, మైదుకూరు రైతు సేవా విభాగం అధ్యక్షుడు నాగిరెడ్డి, కేసీకెనాల్ ప్రాజెక్టు కమిటీ మాజీ అధ్యక్షుడు డీఎల్ శ్రీనివాసులరెడ్డి నివాళి అర్పించారు. కార్యక్రమంలో పత్తూరు మాజీ సర్పంచ్ ముసలయ్య, రామకృష్ణ, వెంకటయ్య, మాజీఎంపీటీసీ గాలిపోతు మనోహర్, కూనవారిపల్లె సర్పంచ్ సుబ్బారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పరామర్శ



జయమ్మ మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బి.కోడూరు : మండలంలోని మేకవారిపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు గంటాక్రిష్టారెడ్డి సతీమణి గంటాజయమ్మ ఆదివారం మృతిచెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ సుధ మేకవారిపల్లెకు చేరుకుని జయమ్మ మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచ్ రమణమ్మ, మాజీ సర్పంచ్ లక్ష్మీనరసారెడ్డి, నాయకులు బాలసుబ్బారెడ్డి, ప్రహల్లాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో ప్రభుత్వ కార్యాలయ భవనాలు

- కూలేందుకు సిద్ధంగా ఉన్న పైకప్పులు
- వందేళ్లనాటి పెంకుటిళ్లలోనే విధులు
- ఆర్డీఓ కార్యాలయ భవనం పూర్తి అయ్యేనా?



శిథిలావస్థలో తహసీల్దారు కార్యాలయం



వందేళ్ల నాటి రిజిస్టర్ కార్యాలయం



పునాదుల వద్దే నిలిచిపోయిన ఆర్డీఓ కార్యాలయం నిర్మాణం

బద్వేలు : బద్వేలు మున్సిపాలిటీలోని పలు శాఖల ప్రభుత్వ కార్యాలయ భవనాలు పూర్తిగా శిథిలావస్థకు చేరుకున్నాయి. అవి ఎప్పుడు కూలుతాయో.. ఎటువంటి ప్రమాదం సంభవించనుందో అర్థంకాక కార్యాలయాల సిబ్బంది భయం భయంగా విధులు నిర్వహిస్తున్నారు. స్థానికంగా ఒకేచోట వందేళ్ల నాటి పెంకుటిళ్లలో ఉన్న వివిధ ప్రభుత్వ కార్యాలయాలైన తహసీల్దారు కార్యాలయం, బద్వేలు రూరల్ పోలీస్ స్టేషన్, రిజిష్టర్ ఆఫీస్, వ్యవసాయ కార్యాలయాలతో పాటు మరిన్ని కార్యాలయాల పైకప్పుగా ఉన్న పెంకుల కింద ఉన్న సిమెంట్ పెచ్చులు ఊడి పడుతున్నాయి. అంతేగాకుండా పెంకులు నిలిచేందుకు వాటి కింద వేసిన చెక్క దిమ్మెలు కూడా కొన్నిచోట చీలిపోయి మరికొన్ని చెదలు పట్టి ఎప్పుడెప్పుడు కూలుదామా అన్నట్లు ఉన్నాయి. దీంతో అధికారులు విధులు నిర్వహించడానికి వచ్చినప్పుడు గంట గంటకూ పైకప్పు చూసుకుంటూ భయం భయంగా విధులునిర్వహించాల్సిన పరిస్థితి దాపురించింది. దీంతో పనిపై ఏకాగ్రత దెబ్బ తింటుందని కార్యాలయ సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫైల్ల పై పడాల్సిన కళ్లు పైకప్పు ఎప్పుడు కూలుతుందో అని చూస్తున్నాయి. మూడేళ్ల కిందట రూ.75 లక్షల ఖర్చుతో నిర్మించిన ప్రభుత్వ కార్యాలయంలో ఆర్డీఓ కార్యాలయాన్ని పెట్టారు. ఆర్డీఓ కార్యాలయం నిర్మాణం కోసం సిద్దవటం రోడ్డు లో దాదాపు 5ఎకరాలు స్థలం కేటాయించారు. అక్కడ కార్యాలయ నిర్మాణం పునాధుల వద్దనే నిలిచిపోయింది. తహసీల్దారు కార్యాలయం కోసం నిర్మించిన భవంతిని ఆర్డీఓ కార్యాలయంకు కేటాయించారు. దీంతో తహసీల్దారు కార్యాలయం వందేళ్ల నాటి పెంకుటిళ్ల లోనే ఉండాల్సివచ్చింది. తహసీల్దారు కార్యాలయ సిబ్బందికి ఒక పాడుబడ్డ భవంతి కేటాయించగా తహసీల్దారు కు ప్రత్యేక పెంకుటిళ్లు కేటాయించారు. అదికూడా వందేళ్లనాటిదే కావడం విశేషం. రిజిష్టర్ ఆఫీస్, రూరల్ పోలీస్‌స్టేషన్, వ్యవసాయ ఏడీ కార్యాలయం అన్నీకూడా పాతకాలం నాటి భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఈ కార్యాలయాల్లో ఉద్యోగులకు అవసరమైన కనీస వసతులు కూడా లేకపోవడంతో చెప్పుకోలేని ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నత అధికారులు తగిన చర్యలు తీసుకొని ఆయా కార్యాలయాల నూతన భవంతులు నిర్మాణం చేపట్టాలని అధికారులు, సిబ్బంది, ప్రజలు కోరుతున్నారు.

ఘనంగా నరసింహస్వామి జయంతి



ప్రత్యేక అలంకరణలో సుదర్శన యోగ నరసింహస్వామి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలోని సత్యనారాయణస్వామి ఆలయంలో ఆదివారం నరసింహస్వామి జయంతి ఘనంగా నిర్వహించారు. వేకువజామున సుదర్శన యోగనరసింహస్వామికి విశేష పూజలు జరిపారు. గణపతి, నవగ్రహ, సుదర్శన లక్ష్మీనరసింహస్వామి మూలమంత్ర హోమాలు, పూర్ణాహుతి, 108 కలశాల పూజా ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించి మూల విరాట్‌ను అలంకరించారు. లోక కల్యాణార్థం సాయంత్రం స్వామి శాంతి కల్యాణం వేద పండితుల మంత్రోచ్చరణలతో శాస్త్రోక్తంగా నిర్వహించారచ్చి కార్యక్రమంలో భక్తులు పాల్గొని స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. వైశాఖ పౌర్ణమి సందర్భంగా సోమవారం ఉదయం తొమ్మిది గంటలకు సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించనున్నారు.

వెల్లాలలో...

రాజుపాళెం : మండలంలోని వెల్లాల లక్ష్మీ నరసింహస్వామి జయంతి వేడుక ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు వెంకటాచలపతి తెల్లవారుజామునే స్వామికి పట్టు వస్త్రాలు సమర్పించి, కుంకుమార్చన, సహస్రనామార్చన, మంగళహారతి అనే ప్రత్యేక పూజలు చేశారు. పెద్ద సంఖ్యలో స్వామిని భక్తులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. సాయంత్రం లక్ష్మీనరసింహస్వామిని ప్రత్యేకంగా అలకరించిన పల్లకిలో ఆశీనులను చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, భక్తులు స్వామికి పూజలు చేశారు.

హనుమంతుడి వాహనంపై చెన్నకేశవుడు



హనుమద్ వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవుడు

రాజుపాళెం : రాజుపాళెం మండలం వెల్లాలలోని ఆలయంలో జరిగే బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం రాత్రి హనుమంతుడి వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత చెన్నకేశవ స్వామి విగ్రహాలను పుర వీధుల్లో ఊరేగించారు. అర్చకులు ముందుగా ఉత్సవ మూర్తులను అలంకరించి, ప్రత్యేక పూజలు చేసి గ్రామోత్సవం నిర్వహించారు. ఈఓ వెంకటరమణ, ఉత్సవ కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ రెడ్డి, భక్తులు స్వామిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి



మాట్లాడుతున్న ఒంటేరు శ్రీనివాసులురెడ్డి

ప్రొద్దుటూరు కల్చరల్ : 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మెమో 57 ప్రకారం పాత పెన్షన్ పథకాన్ని అమలుచేయాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులురెడ్డి అన్నారు. స్థానిక ఉపాధ్యాయ సేవా కేంద్రంలో జిల్లాకు చెందిన 2003 డీఎస్సీ ఉపాధ్యాయులతో ఆదివారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2004 సెప్టెంబర్, 1 నాటికి వెలువడిన ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఎంపికైన ఉద్యోగులందరూ పాత పెన్షన్ పథకం పరిధిలోకి వస్తారని కేంద్ర ప్రభుత్వం మెమో 57ను విడుదల చేసిందని తెలిపారు. దేశంలోని 15 రాష్ట్రాలు దీనిని అమలు చేయగా, ఆంధ్ర రాష్ట్రంలో అమలు చేయలేదన్నారు. దీని కారణంగా ఆ ఉద్యోగులందరూ సీపీఎస్ పరిధిలోకి వచ్చారన్నారు. వారందరినీ పాత పెన్షన్ పరిధిలోకి తీసుకోవడంతోపాటు ఇప్పటివరూ సీపీఎస్ ఉద్యోగులందరికి పాత పెన్షన్ అమలుచేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫోరం కన్వీనర్లు ఉదయ భాస్కర్, వీరప్రతాప్, సుధాకర్, వాసవి, చాంద్ బాషా, రిజ్వాన్, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అందరూ సామరస్యంతో మెలగాలి



మాట్లాడుతున్న అర్బన్ సీఐ రమణారెడ్డి

మైదుకూరు : పట్టణంలో అన్ని మతాల వారు సామరస్యంతో మెలగాలని అర్బన్ సీఐ కె.రమణారెడ్డి తెలిపారు. ఆదివారం పట్టణంలోని అన్ని ప్రార్థనా మందిరాల నిర్వాహకులతో పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పట్టణంలో 12 ఏళ్ల కిందట జరిగిన సంఘటన మినహా ప్రజలందరూ కలిసిమెలిసి ఉంటున్నట్లు తనకు సమాచారం ఉందన్నారు. గతాన్ని మరిచిపోయి అన్ని మతాల వారు పరస్పర అభిమానంతో, గౌరవంతో, సామరస్యంగా జీవించాలని అన్నారు. చట్ట వ్యతిరేక పనులకు పాల్పడుతున్న, తప్పుడు మార్గంలో ప్రయాణిస్తున్న వారి సమాచారం అందివ్వాలన్నారు. పట్టణంలో ట్రాఫిక్, చోరీలపై దృష్టి సారించినట్లు సీఐ తెలిపారు. ఇందు కోసం పట్టణంలో ఉన్న సీసీ కెమెరాల పనితీరును పర్యవేక్షిస్తున్నామన్నారు. అన్ని ప్రార్థనా మందిరాల్లో సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఉండాలని, లేకపోతే వెంటనే ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఐ సుబ్బారావు, ఏఎస్ఐ మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు అవగాహన

మైదుకూరు ఆర్టీసీ బస్టాండ్‌లో దొంగతనాలపై అర్బన్ సీఐ ప్రయాణికులకు అవగాహన కల్పించారు. విలువైన బంగారు ఆభరణాలు, వస్తువులతో ప్రయాణిస్తున్నప్పుడు ఏమరపాటుగా ఉండటం, బస్సులో బ్యాగ్‌లను మరిచిపోవడం చేయరాదని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులపై తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో అర్బన్ ఎస్ఐ చిరంజీవి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి ఆర్థిక సాయం



నరసయ్యకు నగదు అందజేస్తున్న కువైట్ యాదవ సంఘం నాయకులు

అట్లూరు : మండల పరిధిలోని కోనరాజుపల్లె గ్రామానికి చెందిన ఎం.నరసయ్యకు కువైట్ యాదవ సంఘం తరపున రూ.50 వేల నగదు సాయం అందజేశారు. కోనరాజుపల్లె గ్రామానికి చెందిన ఎం.నరసయ్య కుమారుడు నవీన్ బెంగళూరులో విద్యుత్‌షాక్‌కు గురై మృతిచెందడంతో ఆ కుటుంబం గడవడం భారంగా మారింది. దీంతో ఆదే గ్రామానికి చెందిన నాగసుబ్బయ్యయాదవ్ కువైట్ యాదవ సంఘం అధ్యక్షుడు చల్లాబాబుయాదవ్ దృష్టికి తీసుకెళ్ళడంతో స్పందించి రూ.30 వేలు సంఘం తరపున, అలాగే రూ.20 వేలు చందాల రూపంలో నగదును ఆదివారం నరసయ్యకు అందజేశారు. కార్యక్రమంలో కువైట్ యాదవ సంఘం పోరుమామిళ్ళ మండల అధ్యక్షుడు నరసింహులు, అట్లూరు మండల అధ్యక్షుడు మునెయ్య, బద్వేలు మండల అధ్యక్షుడు బుర్రిరాజాయాదవ్, సంద్రాశ్రీనులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి



దేవాలయాల నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎస్ఐ తిమోతి

కలసపాడు : మండలంలోని దేవాలయాల్లో దొంగతనాలు జరగకుండా ఉండేందుకు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్ఐ తిమోతి తెలిపారు. ఆదివారం స్థానిక పోలీసుస్టేషన్‌లో మండలంలోని దేవాలయాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో జరిగే నేరాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దొంగతనాలు, నేరస్తులను గుర్తించడానికి సీసీ కెమెరాల ఏర్పాట్లపై అవగాహన కల్పించారు. అలాగే ఆన్‌లైన్ మోసాలు, లోన్ యాప్స్, సైబర్ క్రైమ్స్, మహిళలు, చిన్నపిల్లలపై జరిగే నేరాలు, వాటి శిక్షల గురించి వివరించారు. ట్రాఫిక్ రూల్స్ అతిక్రమిస్తే జరిగే అనర్థాలు, కట్టవలసిన జరిమానాల గురించి వివరించారు. సమావేశంలో దేవాలయాల నిర్వాహకులు పాల్గొన్నారు.

పుస్తక పఠనంతో మేధాశక్తి

అట్లూరు : విద్యార్థులకు పుస్తక పఠనంతో మేధాశక్తి పెరుగుతుందని గ్రంథాలయాధికారి ఎం.సుధాకర్ తెలిపారు. మండలంలోని అట్లూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన తరగతులు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఈ తరగతులకు 20 మంది విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల చేత పుస్తక పఠనం చేయించడంతో పాటు తెలుగు నీటి కథలు చెప్పించారు. అనంతరం విద్యార్థులతో డాన్స్, ఖోఖో, కబడ్డీ తదితర ఆటలు ఆడించారు.

మైనార్టీ రుణాలకు దరఖాస్తు చేసుకోండి

పోరుమామిళ్ల : మండలంలో మైనార్టీ రాయితీ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ ఆర్.రమణారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రుణాలు నాలుగు స్లాబ్‌లో ఇవ్వడం జరుగుతుందన్నారు. అభ్యర్థుల వార్షిక ఆదాయం రూ.1.50 లక్షలకు మించరాదన్నారు. తెల్లరేషన్‌కార్డు, ఆధార్ కార్డు తప్పక కలిగి ఉండాలని, ఈ యూనిట్లలో 33 శాతం మహిళలకు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తి గల మైనార్టీలు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుని సంబంధిత సర్టిఫికెట్లు జతపరిచి మండల పరిషత్ కార్యాలయంలో అందజేయాలని, వివరాలకు మండల పరిషత్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : జిల్లాలో నిబంధనలను పాటించని బీఈడీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి విశ్వనాథ్ ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. కొన్ని బీఈడీ కళాశాల యాజమాన్యాలు స్టాఫ్, ల్యాబ్‌లు లేకుండానే నడుపుతున్నాయని ఆరోపించారు. ఎడ్‌సెట్ పరీక్ష పూర్తి కాకుండానే బయటి రాష్ట్రాల నుండి అడ్మిషన్లు తీసుకుని వేలాది రూపాయలు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. అటువంటి బీఈడీ కళాశాలల యాజమాన్యాలపై యూనివర్సిటీ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాజకీయ కక్ష సాధింపు చర్య



చొక్కం సంజీవయ్య

మైదుకూరు : సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనుంజయరెడ్డి ఇంటిలో ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే సోదాలు చేయడం రాజకీయ కక్ష సాధింపు చర్యేనని వైఎస్సార్‌సీపీ మేధావుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కం సంజీవయ్య అన్నారు. ఈ చర్యను పత్రికా స్వాతంత్ర్యంపై జరిగిన దాడిగా భావిస్తున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఇలాంటి చర్యలు ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీయడమే కాక, భావ ప్రకటనా స్వేచ్ఛను అణిచివేసే ప్రయత్నమని తెలిపారు. జర్నలిస్టులపై కక్షపూరితంగా వ్యవహరించే ఈ కుట్రలను వైఎస్సార్‌సీపీ మేధావుల విభాగం తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం



విద్యాబుద్ధులు నేర్పిన గురువులతో పూర్వ విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : నాడు చదివిన పూర్వ విద్యార్థులంతా ఒక్కచోట చేరారు. ఉపాధ్యాయులతో చేసిన అల్లర్లు, తీపి జ్ఞాపకాలను నెమరువేసుకుని మురిసిపోయారు. స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్‌లో 1994–99 మధ్య చదివిన పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు. జిల్లాతోపాటు రాష్ట్రం, ఇతర రాష్ట్రాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు వేడుకలో పాల్గొని ఉత్సాహంగా గడిపారు. తాము చదువుకున్న పాఠశాల, విద్యాబుద్ధులు నేర్పించిన గురువులను గుర్తు చేసుకున్నారు. వారి గురువులు నారాయణరెడ్డి, సరస్వతి, వెంకటేశ్వరరెడ్డి, నారపరెడ్డి, సాధిక్‌హుస్సేన్, జయరామిరెడ్డి, రమణ, సుబ్బరాయుడులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాజేష్, సురేష్, బాలకృష్ణ, వరప్రసాద్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ వాహనంపై ఊరేగిన అగస్త్యేశ్వరుడు



గజవాహనంపై రాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరుడు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఎనిమిదో రోజున విశేష పూజలు నిర్వహించారు. స్వామికి మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి విశేష అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. గవ్యాంతర పూజలు, మండప పూజలు, దీక్షా హోమాలు నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను అలంకరించి ఊరేగించారు. సాయంత్రం గంగా రాజరాజేశ్వరీ సమేత అగస్త్యేశ్వరస్వామి ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి గజవాహనంపై ఆశీనులను చేశారు. పురవీధుల్లో స్వామిని భక్తి శ్రద్ధలతో శివనామ స్మరణతో ఊరేగించారు. పట్టణానికి చెందిన వాసవి అన్నమయ్య లహరి ఆధ్వర్యంలో దేవరశెట్టి మణిశయన, పావని శివ భక్తిపాటలు ఆలపించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో వీరాంజనేయస్వామి

మైదుకూరు : మున్సిపాలిటీ పరిధిలోని కొత్తపాలెం గ్రామంలో ఆదివారం శ్రీవీరాంజనేయస్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం ఉదయం ఆలయంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేసి గణపతి పూజ, కుంకుమార్చన, పంచామృతాభిషేకం, అష్టోత్తర నామ పూజలు నిర్వహించారు. సోమవారం ప్రత్యేక పూజలు, మధ్యాహ్నం అన్న ప్రసాద వినియోగం, జిల్లాస్థాయి కోలాటం పోటీలు, రాత్రికి జెండా ఊరేగింపు నిర్వహిస్తున్నట్టు ఆలయ ధర్మకర్త చిట్టిబోయిన సుబ్బరాయుడు తెలిపారు. మంగళవారం రాష్ట్రస్థాయి సీనియర్ కేటగిరి వృషభరాజములకు బండలాగుడు పోటీలను నిర్వహిస్తామన్నారు.

నేడు తిరునాల మహోత్సవం

ఖాజీపేట : భక్తుల కోంగు బంగారం కోరిన కోర్కెలు తీర్చేదైవంగా కె.సుంకేసుల గ్రామంలో శ్రీ వీరాంజనేయస్వామి తిరునాల 12వ తేదీన జరగనుంది. అన్ని ఎర్పాట్లు కమిటీ సభ్యులు పూర్తి చేశారు. ప్రతి ఏటా మొలకల పౌర్ణమి నాడు ఈ ఉత్సవాలు నిర్వహిస్తారు. పున్నమి రోజున పూర్వం పెద్దలు విత్తనాలను నానబెట్టి మొలకలు వచ్చిన తరువాత వాటిని ఆలయంలోని వీరాంజనేయ స్వామి వద్ద ఉంచేవారు. ఎద్దుల బండితో పాటు వ్యవసాయ సామగ్రిని ఆలయంలోకి తెచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించేవారు. అందుకే వీరాంజనేయస్వామి తిరునాల మొలకల పౌర్ణమి తిరునాలగా ప్రసిద్ధి పొందిందని స్థానికులు చెబుతున్నారు. అలాగే ఉదయం 7 గంటల నుంచి బండలాగుడు పోటీలను నిర్వస్తారు. పోటీల్లో ప్రథమ బహుమతి రూ.40వేలు 2వ రూ.30 వేలు, 3వ రూ.15వేలు, 4వ రూ.10వేలు, 5వ రూ8, వేలు, 6వ రూ.6వేలు కమిటీ వారు నిర్ణయించారు. అలాగే రెండెద్దుల పరుగు పందెం కూడా నిర్వహిస్తున్నారు. ప్రథమ బహుమతిగా రూ.10,116, 2వ రూ.6.500, 3వ రూ.6వేలు, 4వ రూ.5016గా నిర్ణయించారు. అలాగే చిన్నపిల్లలకు ఆటల పోటీలు, భక్తులకు అన్నదానం నిర్వహిస్తున్నారు.

ఘనంగా గంగజాతర



బోనాలు తీసుకెళుతున్న మహిళలు

రాజుపాళెం : మండలంలోని ఉప్పలపాడు గ్రామంలో ఆదివారం గంగ జాతర వైభవంగా నిర్వహించారు. తెల్లవారు జామునే గంగమ్మను ప్రత్యేకంగా అలంకరించారు. తప్పెట్లు, మేళతాళాల మధ్య బాణసంచా పేల్చుతూ పెద్ద సంఖ్యలో మహిళలు అమ్మవారికి బోనాలు సమర్పించారు. బంధువులుతరలి రావడంతో పండగ వాతావరణం నెలకొంది.

ఒక చోట కలుసుకుని.. జ్ఞాపకాలను నెమరు వేసుకుని



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

మైదుకూరు : మైదుకూరులో ఆదివారం 33 ఏళ్ల కిందట ఇంటర్మీడియట్ చదువుకున్న విద్యార్థులు ఒక చోట కలుసుకుని పాత జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. స్థానిక ఆర్ఈఎస్ జూనియర్ కళాశాలలో 1990–92 సంవత్సరంలో ఇంటర్మీడియట్ చదివిన విద్యార్థులు మైదుకూరులోని కేఎస్ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించారు. అప్పట్లో తమకు చదువు చెప్పిన అధ్యాపకులను ఆహ్వానించి వారిని సత్కరించి ఆశీస్సులను అందుకున్నారు. స్నేహితులందరూ సాయంత్రం వరకు ఒకరి గురించి మరొకరు వారి వ్యాపకాలను, పిల్లల చదువులు, ఉద్యోగాల గురించి తెలుసుకుంటూ జ్ఞాపకాలను పంచుకున్నారు.

బద్వేలు అర్బన్ : స్నేహితులంతా కలుసుకుని తమ జ్ఞాపకాలను పంచుకోవాలనుకున్నారు. ఎక్కడెక్కడో స్థిరపడిన మిత్రులంతా ఆదివారం కలుసుకుని చదువుకునే రోజుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ ఉత్సాహంగా, ఆనందంగా గడిపారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని రాఘవేంద్ర గ్రాండ్‌లో శ్రీషిర్డి సాయి విద్యాలయం 1992–93 ఎస్ఎస్‌సి బ్యాచ్ పూర్వ విద్యార్థులు నిర్వహించిన పూర్వ విద్యార్థుల కలయిక కార్యక్రమంలో చిన్ననాటి స్నేహితులు, వారి కుటుంబ సభ్యులంతా కలుసుకుని ఉల్లాసంగా గడిపారు. విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించుకున్నారు. సాంబమూర్తిరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలపై పోరాటం చేద్దాం

బద్వేలు అర్బన్ : విద్యాశాఖ అనుసరిస్తున్న వైఖరిని నిరసనగా సోమవారం కడపలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను జయప్రదం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదనవిజయకుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ జీవో 117ను రద్దు చేస్తామని, ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం దానికి విరుద్ధంగా ప్రయాణించడం బాధాకరమన్నారు. సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో ఈ నెల 15న వేలాది మంది ఉపాధ్యాయులతో విజయవాడలోని విద్యాభవన్‌ను ముట్టడించడం జరుగుతుందని హెచ్చరించారు. ఉన్నతాధికారులు జోక్యం చేసుకుని సమస్యలను పరిష్కరించాలన్నారు.